# సూటిగా

వి. రాజారామ మోహనరావు

మొదటిసారి చూసినప్పుడు నిజంగా ఆ అమ్మాయి తనవేపే చూస్తోందా అనుకున్నాడు సురేంద్ర. రెండోసారి తనవేపే చూస్తున్న ఆ అమ్మాయి తను చూడగానే తల తిప్పకోటం చూశాడు. అంతే యింక ఆ తర్వాత ఆ అమ్మాయి వేపే చూస్తూ నిలబడ్డాడు.

తిరిగి ఒకటి రెండుసార్లు ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి. ఒకటి రెండు నవ్వులు అటూయిటూ ప్రయాణం చేశాయి.

మరి కాస్సేపటికి చేతిలో బ్రీఫ్ కేస్ కిందపెట్టి టైముని సరిచేసుకున్నాడు సురేంద్ర. జుట్టు సర్దుకున్నాడు. చుట్టూ చూసి, వోసారి తనలోకి తను చూసుకుని ఆ అమ్మాయివేపు నడిచాడు. దగ్గరికెళ్లాక గొంతు సరిచేసుకుని "హలో" అన్నాడు.

"హలో" అన్నట్టు నవ్వింది ఆ అమ్మాయి.

"ఎంతవరకు వెడుతున్నారు" అడిగాడు.

చెప్పింది.



ఆ తర్వాత కొన్ని మాటలు, మరికొన్ని నవ్వుల తర్వాత ఆ అమ్మాయి పేరు జయ అని తెలిసింది. గంటన్నర ప్రయాణంలో నాలుగైదు మృదుస్పర్శల చొరవతో, చివరికి యిద్దరికీ అండర్‌స్టాండింగ్ కుదిరింది.

మొత్తానికి యిద్దరి పరిచయం అయి మూడు గంటలు దాటకముందే, లాడ్జిలో రూము తీసుకుని సెటిల్ అయ్యారు.

"నాకిదంతా కలలా వుంది" అన్నాడు ఆ అమ్మాయి పక్కనే మంచం మీద కూచుంటూ.

"ఎందుకట" అంది నవ్వుతూ జయ.

"ఎందుకేమిటి .... యింతటి అందం యింత తొందరగా అనుభవంలోకి...."

"మిస్టర్ సురేంద్రా.... ఈ ధోరణేం వొద్దు. నేను యిందాకా బస్సులోనే చెప్పాను.... మళ్ళీ చెపుతున్నాను. చదువు, బందిఖానాలాంటి కాలేజి హాస్టల్. వీటి నుంచి కొంతసేపైనా దూరంగా వుండాలనే యిలా వచ్చాను. మనం కలిసి గడిపే ఈ కాస్సేపైనా ఫ్రీగా, స్వేచ్ఛగా గడిపితే బావుంటుంది. ఇద్దరు.... వో ఆడ, మగ కలిసి హాయిగా గడపటానికి పెద్దగా పరిచయాలు, ప్రేమలు అక్కర్లేదు.... అందుకని మీరు హాయిగా వుండి, నన్ను హాయిగా వుండనివ్వండి." అంది.

సురేంద్ర యింకేం మాట్లాడలేదు. ఈ అనుభవం, కొత్తగావుంది. ఈ అనుభవం ఎత్తుకి తను ఎదగాలని, ఆ రోజుకి జయతో చాలా అపురూపంగా గడపాలని సురేంద్రకి గట్టిగా అనిపించడానికి ఎంతో సేపు పట్టలేదు.

> జీవితం చెట్టే చేదుగా వున్నప్పుడు అనుభవాల ఆకులు మాత్రం చేదుగా వుండవా ?

కాస్మాటిక్స్ సేల్స్ రిప్రజెంటేటివ్‌గా సురేంద్రకి ప్రయాణాలు అలవాటే. పెళ్ళి కాని మగాడిగా, అందులో నాలుగు వూళ్ళు తిరిగే వ్యక్తిగా ఆడవాళ్ళతో అనుభవాలకి లోటులేదు.

తరచుగా సురేంద్ర వెళ్ళే వూళ్ళల్లో ఆడవాళ్ళ వ్యవహారాలు కుదిర్చి పెట్టే బ్రోకర్స్ కూడా వున్నారు. అలాంటివాడు గురువులు యీ వూళ్ళోనూ వున్నాడు.

గురువులు గుర్తొచ్చేటప్పటికి సురేంద్రకి కిందటిసారి ఆ వూరు రావటం, "యీ రాత్రికి తప్పకుండా," అంటూ మూడు రాత్రుళ్ళు తనని వాడు నానా యాతనా పెట్టటం, చివరికి నిరాశే మిగల్చటం గుర్తొచ్చింది.



MCA/PDC/62/Tel

ఈసారి ఆ బాధే లేదు. అసలు పోలికే లేదు. ఈ కాలేజీ యౌవనానికి ....ఆ బజారు అనుభవాలకి పోలికే లేదు. నిజంగా అదృష్టం రియల్లీ లక్కీ.

"ఏమిటీ ఆలోచన" అంది జయ. సురేంద్రని చూపుడువేలుతో పొడుస్తూ.

తనలోని ఆలోచన జయతో చెప్పకో లేందికాబట్టి "అబ్బే ఏం లేదు. ఏం లేదు" అన్నాడు. అని యింక ఆ రోజుకి, జయతో గడిపే ఆ రోజుకి యిలాంటి ఆలోచనలేం లేకుండా జాగ్రత్తపడాలనుకున్నాడు.

ఆ రోజు నిజంగానే అపురూపంగా గడిచింది సురేంద్రకి. గడుస్తున్న సమయంలో ప్రతి నిమిషం కొత్తగా, ఉత్సాహంగా వుండేలాగే ప్రవర్తించింది జయ.

జయతో కలిసి గడపటమే తప్ప మరో ధ్యాస లేకుండాపోయింది సురేంద్రకి. ఇద్దరూ లాడ్జిలోనే వుండిపోకుండా ఊరు తిరిగారు. సినిమాకి వెళ్ళారు. బజారు కెళ్ళారు. జయని పక్కన వేసుకుని అలా తిరుగుతుంటే గొప్పగా, అయాచితంగా లభించిన ప్రేయసితో గడుపుతున్నట్టనిపించింది సురేంద్రకి.

తెల్లారగానే వెళ్ళిపోవాలని, యింక వుండటం కుదరదని చెప్పింది జయ సినిమానుంచి లాడ్జి చేరగానే. అందుకే రాత్రి గడుస్తున్నకొద్దీ ఆ సమయం మరింత విలువైందన్నట్టు, జయతో ఆ అనుభవాన్ని వీలున్నంతగా ప్రియమైన అనుభూతిగా మార్చుకోవాలన్నట్లు గడిపాడు సురేంద్ర.

తన విషయం తనతృప్తి, తన అదృష్టమే తప్ప.... యింక అన్నీ మరిచిపోయాడు సురేంద్ర ఆ రాత్రి.

* * *

తెల్లారి జయకన్నా సురేంద్రకే ముందు మెలకువవొచ్చింది. ఆద మరచి నిద్రపోతోంది జయ. నిద్రలో మరింత అందంగా కనిపించింది. నిన్నటి నుంచీ కలిసి గడిపారు. మరి కొంచెం సేపటిలో విడిపోతుంది. కొంచెం దిగులనిపించినా.. తనని తను సంబాళించుకున్నాడు.

మంచంమీంచి హుషారుగా లేచాడు. జయని ఒక్క క్షణం చూసి సిగరెట్టుపెట్టె కోసం టేబిల్ వేపు నడిచాడు. సిగరెట్లు అయిపోయాయి. బాయ్‌ని పిలవటం, తెమ్మనటం నిద్రపోతున్న జయకి యిబ్బంది కలుగుతుందని తనే బైల్దేరాడు సిగరెట్లకి.

కాఫీ తాగుతూ సిగరెట్టు కాల్చుకుంటూ జయని గుర్తు తెచ్చుకుంటుంటే హ[illegible]గా వుంది సురేంద్రకి.

సురేంద్ర కాఫీ పూర్తి చెయ్యకముందే "నమస్కారం గురూగారూ" అంటూ వచ్చాడు గురువులు.

"నమస్తే.... నమస్తే...." అన్నాడు సురేంద్ర. కిందటిసారి అనుభవానికి గురువులంటే చిరాకు కలగాలి సురేంద్రకి. కానీ ఎందుకో గొప్పగా అనిపించింది. వాడు కిందటిసారి యాతన పెట్టినా ఈసారి అనుకోని అదృష్టం కలిసొచ్చిందనీ, వాడి అవసరం తనకి లేదనో ఎందుకో యిద మిద్ధంగా తెలీకపోయినా గొప్పగా వుంది. ఆ గొప్పకి కారణం మాత్రం జయే అని తెలుసు.

"ఈసారికి మీకు నా అవసరం లేదని తెలుసనుకోండి కానీ, మళ్ళీ వచ్చినప్పుడు నన్ను మరిచిపోకండి" అన్నాడు గురువులు.

ముసిముసిగా నవ్వాడు సురేంద్ర.

గురువులూ నవ్వాడు. నవ్వి "సరేకానీ గురూగారూ యింతకీ యెంత తీసుకుంది" అన్నాడు.

"ఎవరూ" అన్నాడు సురేంద్ర.

'అదే మీతో యిప్పుడున్న అమ్మాయి' అన్నాడు గురువులు.

"ఛీ నోర్ముయి. ఎవర్నిపడితే వాళ్ళని నీ యిష్టం వచ్చినట్టు మాట్లాటమేనా- ఆ అమ్మాయి నా స్నేహితురాలు- చదువుకుంటోంది."

"సరేలెండి గురూగారూ అది అలాగే చెపుతుంది. కానీ పాత కాతాయే యీ వూరికి...." అన్నారు.

"ఛీ నోర్ముయ్.. మళ్ళీ అదేకూత" అన్నాడు. సురేంద్ర కోపంగా లేస్తూ.

లేస్తున్న సురేంద్రని చెయ్యి పట్టుకు కూచోపెట్టాడు గురువులు. "మీకు అబద్ధం చెపితే నాకేం వొస్తుందండీ. ప్రమాణపూర్తిగా చెపుతున్నాను. కావాలంటే యిప్పుడెళ్ళి దాన్నే అడగండి. దాని స్టైల్ వేరు. అందుకే మీకు నమ్మకం కుదరటం లేదు," అన్నాడు గురువులు.

గురువులు మరిన్ని వివరాలు చెప్పాక యింకేం మాట్లాడలేకపోయాడు. సురేంద్ర తల తిరిగింది. "యింత మోసమా.... యింత నటనా...." అనుకున్నాడు జయ మీద విపరీతమైన కోపం వొచ్చింది. అంత కోపంగానూ లాడ్జి రూమ్‌లోకి వచ్చాడు.

అప్పటికే జయ నిద్రలేచి స్నానం చేసింది. సురేంద్రని చూసి నవ్వుతూ "పొద్దున్నే యెక్కడికి వెళ్ళారు రండి. బాయ్‌ని కాఫీ తెమ్మనమని చెప్పాను. తాగుదాం" అంది. అంతా నిన్నటిలాగే అదేనవ్వు.... అదే మాట.... ఏంతేడాలేదు. ఇంత నటనా....యింక నిగ్రహించుకోలేకపోయాడు సురేంద్ర.

"అసలు యెవరు నువ్వు...." అన్నాడు జయ దగ్గరగా వెళ్ళి.

"అంటే" అంది.

"నువ్వుబజారుదానివే కదూ" అన్నాడు

జయేం మాట్లాడలేదు.... నెమ్మదిగా సురేంద్ర చేతిని విడిపించుకుంది..మంచం దగ్గరకెళ్ళి కూచుంది.

# చురకలు

ఓట్ల రాజకీయాలలో మంత్రి
నోట్ల భోజనాలలో "కంత్రి!"

* * *

ఎదుటైతే ఆఫీసర్‌కి "స్తుతి"
బయటకొచ్చాక అబ్బబ్బా "సుత్తి"

** * *

మంత్రిగారికి ప్రాణం పోసింది మంత్రసాని
మరి ఇప్పుడు ప్రాణం తీస్తోంది మంత్రసాని* !

* "భార్య" అను అర్థమున వాడబడినది.

* * *

అమ్మాయికి ఉన్న లొసుగు
కట్నమా దానికి ముసుగు?

* * *

నీ ప్రేమకథా రహదారిలో స్పీడ్‌బ్రేకర్స్
నిన్ను కనీ, పెంచిన నీ పేరెంట్స్!

* * *

ఆఫీసు శలవకోసం "మిష"
నిజానికది ఉత్త "బుస"!

* * *

నిజ జీవితంతో పోలిస్తే వయసులో మనుమరాలు
మరి సినీ జీవితంలో మనసిచ్చిన ప్రియురాలు!

* * *

ఎన్నేస్తేనేం యింటర్‌వ్యూ రిహార్సలు
ఉద్యోగానికి కావాలి సిఫార్సులు!

* * *

ప్రేమించలేని మనస్సు
డ్రైవర్‌లేని బస్సు!

— కె.ఎస్.వి. నరసింహారావు

"ఏం మాట్లాడవేం." అన్నాడు సురేంద్ర తిరిగి.

"అవును.... అయితే మీ కేమన్నా నష్టమా" అంది జయ.

"కాదూ నష్టం కాదు-అయినా నువ్వు.. నిజంగా...."

"అవును.... మీకు ఎలా తెలిసిందీ అన్న ఆరాలు అక్కర్లేదు- నేను బజారు దాన్ని అవటంవల్ల ఏమిటి యిప్పుడు మీకు నష్టం"

"నష్టమంటే.... నష్టమంటే...." వెంటనే ఏం అనాలో తెలియక తడబడ్డాడు సురేంద్ర.

"మీ నష్టమేమిటో నేను చెపుతాను. మంచి అందమైన కాలేజి పిల్ల మీ అందం చూడగానే మీ వెనకాలపడి అన్నీ మరిచి పోయి మీతో గడిపిందన్నగొప్పకి నష్టం. మీరు ఏదో అనుకుని రాత్రంతా గడిపారు. దానికి భిన్నంగా నిజం తెలిసింది- అదీ నష్టం. సరే మీ నష్టం గొడవ వది లెయ్యండి.

ఇలా ఎందుకు నటన. అందరూ వ్యాపారం చేసుకునే ఆడాళ్లలా ఏ లాడ్జిలోనో ఎందుకు మకాం పెట్టలేదనేగా మీ ప్రశ్న. ఒక్కమాటలో చెప్పాలంటే యిది నా వ్యాపారం, నా యిష్టం. కానీ అసలే కొంప మునిగిందని బాధపడుతున్న మిమ్మల్ని యింకా బాధపెట్టకూడదని చెపుతున్నా. యిలా ఈ రకంగా వుండటంలో తాత్కాలికమే అయినా నాకూ ఈ భ్రమ బాగుంది. వ్యాపారానికీ వీలుగా వుంది. దానికన్నా సూటిగా చెప్పాలంటే నిన్న మనం బస్‌స్టాండ్‌లో కలిసినప్పుడు. "నేను యిలాంటి దాన్ని.... నా రేటు యాభై రూపాయలంటే మీరు యిలా నన్ను చూసేవారా? యీ రాత్రి యింత హాయిగా గడిపేవారా?

అంతే. జీవితమే యిలా మారినప్పుడు నిజాలు తెలియటంవల్ల, ఏది ఎందుకు జరుగుతోందో అని ఆలోచించటం వల్ల యిబ్బంది తప్ప యింకేం మిగలనప్పుడు ఏం చెయ్యటం చెప్పండి. ఏదో రకంగా బతికేటయం తప్ప.. నేనూ అంతే చేస్తున్నాను. నిన్నటి నుంచీ మనం బజార్లో తిరిగినప్పటినుంచీ నా దగ్గర చేర్చుకున్న యాభై.. నా రేటు తీసుకెడుతున్నాను నేను మిమ్మల్ని మోసం చేశానను కుంటున్నారు, నిజానికి మిమ్మల్ని, నన్ను మోసం చేస్తున్న శక్తి, జీవితం వేరు. వస్తా."

సురేంద్ర చూస్తుండగానే, అతని ముందే జీవంలేని నవ్వు నవ్వుతూ వెళ్ళిపోయింది జయ.


## దరఖాస్తులు కోరబడుచున్నవి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే రిజిష్టరు చేయబడినది

ఉద్యోగములు : 1. Clerks. 2. Cashiers. 3. Accountants. 4. Field Man. 5. Field Mastry. 6. Field Asst. 7. Sub- Asst. 8. Sugarcane Asst. 9. Craft instructors.

జీతము : రు. 480/- to రు. 750/-లు, అర్హతలు : 7th Pass: S. S. C., Inter. Degree.

Accountancy, Agriculture, Banking కోర్సులందు Postal ద్వారా శిక్షణపొంది June/July నెలలో జరుగు ప్రభుత్వ పరీక్షలందు ఉత్తీర్ణులైనవారు పై ప్రభుత్వోద్యోగములలో నియమింపబడుటకు అర్హులు. పై ప్రభుత్వోద్యోగములు చేయుటకు శిక్షణ పొందగోరువారు దరఖాస్తు ఫారము, పూర్తి వివరములకు 10 రోజులలోగా రు 3-50 లు దిగువ అడ్రసుకు M. O. చేసి పొందవచ్చును.

Manager, S. N. A. T. Training Institute, Chilakaluripet, GUNTUR. Dt.





లభిస్తుంది నెలకు రు. 20 వాయిదా పైన

గ్యారంటీ 5 సంవత్సరాలు

స్ప్రింగ్‌ఫీల్డ్ సూపర్‌షాట్ 77 ఎయిర్ రైఫిల్

.22 రైఫిల్డ్ బోర్
పొడుగు 1.16 మీ.
బరువు 3 కి.గ్రా.
రేంజ్ 100 మీటర్లు
డబుల్-పుల్ ట్రిగ్గరు
యాక్షన్ బ్రేక్‌డౌన్ బేరల్
ఆకర్షణీయమైన మెత్తటి బట్
ఆత్మరక్షణకు, చిన్నచిన్న వేటలకు.
టార్గెట్ షూటింగుకూ ఆదర్శప్రాయమైంది
లైసెన్సు అవసరం లేదు
పోస్టేజి పేకింగ్ రు. 40. ధర రు. 500.
ఇంగ్లీషులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరపండి

apsara sa 77 4 Tel.

SPRINGFIELD AGENCIES (Regd.)
E-32 FATEH NAGAR NEW DELHI-110018

ఆర్డరు ఫారం — ఈరోజే పోస్టు చేయండి

*The Manager* AJP-8
*Springfield Agencies (Regd.), New Delhi-110018*
*Dear Sir,*
*Please send me One Springfield Supershot-77 Air Rifle on Rs. 20/- per month instalment alongwith all the documents for possession. As per your instalment system, I agree to pay the instalments regularly.*

NAME ........................ AGE ...... YEARS
ADDRESS ........................
P O .............. PIN ☐☐☐☐☐☐ DIST ..........
OCCUPATION .............. SIGN ..............

FILL THIS FORM IN ENGLISH IN BLOCK LETTERS
DO NOT SEND ANY ADVANCE WITH THIS ORDER